క్లుప్తంగా

మళ్లీ అధికారంలోకి తీసుకురావాలి



విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దెందులూరులో జరిగిన 'ఎన్నికలకు సిద్ధం' సభకు పి.గన్నవరం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ నుంచి 50 బస్సులు, 100 కార్లలో నాయకులు, కార్యకర్తలు సిద్ధం సభకు తరలి వెళ్లారని వివరించారు. ఇదే స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయం కోసం పాటుపడాలని విప్పర్తి కోరారు.

అయినవిల్లిలంకలో 104 సేవలు



రోగులకు సేవలు అందిస్తున్న వైద్యాధికారి సంతోష్

అయినవిల్లి: అయినవిల్లిలంకలో అయినవిల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 104 సేవలు సోమవారం అందించారు. అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్ 100 మంది రోగులను పరీక్షించారు. జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు, సుగర్, బీపీ తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరి వెంట ఎంఎల్‌హెచ్‌పీ మల్లి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

అయినవిల్లి ఎస్సైగా రాజేష్‌కుమార్



అయినవిల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సైగా వి.రాజేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకూ పనిచేసిన అయినవిల్లి ఎస్సై సురేష్‌బాబు బదిలీపై రామచంద్రపురం వెళ్లారు. ఎస్సై వి.రాజేష్‌కుమార్ కాకినాడ నుంచి బదిలీపై అయినవిల్లి ఎస్సైగా వచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఎస్సై రాజేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

అంబాజీపేట ఎస్సైగా చిరంజీవి



అంబాజీపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సైగా కె.చిరంజీవి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం అర్బన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎ.చైతన్యకుమార్ మండపేట రూరల్‌కు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై చిరంజీవికి స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆత్రేయపురం ఎస్సైగా శ్రీనివాస్



ఆత్రేయపురం: మండల పోలీస్‌స్టేషన్ ఎస్సైగా శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పాలకొల్లు నుంచి బదిలీపై వచ్చారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

పేదలకు సాయం పంపిణీ

సఖినేటిపల్లి: రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన సోమవారం గ్రామ పంచాయతీ వద్ద నిర్వాహకులు 100 మంది పేదలకు సాయం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.100 నగదు, 5 కేజీల బియ్యం చొప్పున అందజేశారు. కాగా దాతలు సాయంతో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ట్రస్ట్ ఫౌండర్ సరెళ్ల విజయ్ ప్రసాద్ తెలిపారు. ఈ నెలకు గాను పాటబళ్ల పెద్దిరాజు రూ.20 వేలు, మత్తి బాబూరావు కుటుంబ సభ్యులు రూ.10 వేలు ట్రస్ట్‌కు విరాళం అందజేశారన్నారు. సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

అంబాజీపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గంగలకుర్రు అగ్రహారం సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించనున్నట్లు అంబాజీపేట వైద్యాధికారిణి వి.గౌతమి తెలిపారు. ఈ మెగా క్యాంపులో అన్ని రకాల రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గౌతమి కోరారు.

జూనియర్ కళాశాల భవనాన్ని పునర్నిర్మించాలి

అమలాపురం రూరల్: కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలమైన నేపథ్యంలో కళాశాల భవనాన్ని పునర్నిర్మించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యను వివరిస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాకు వినతిపత్రం అందజేశారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఓ వరం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- గ్రామాల్లో చురుగ్గా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్



పాదలాడలో రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



వీరవల్లిపాలెంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టా రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న మహిళలు

రాజోలు: లబ్ధిదారులకు ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ ఓ వరంగా మారిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం పలువురు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన ఇంటి పట్టా పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అందజేసిన పట్టాలను ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో నిరుపేద మహిళలకు సొంత ఇంటిస్థలం వారి పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రభుత్వం ద్వారా పొందిన ఇంటి పట్టా భూమిపై పూర్తి హక్కు లభిస్తుందన్నారు. పాదలాడలో 72 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఎంపీపీ కేతా శ్రీనివాస్, సర్పంచ్ కడలి సత్యనారాయణ, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మల్లాడి కృష్ణ, వీఆర్వో అప్పారి గంగాధరరావు, గ్రామ సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో జగనన్న కాలనీల పట్టా రిజిస్ట్రేషన్లు చురుగ్గా జరుగుతున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి తెలిపారు. సోమవారం మండలంలోని అయినవిల్లి, వీరవల్లిపాలెం, సిరిపల్లి గ్రామాల్లోని సచివాలయాల్లో జగనన్న పట్టా రిజిస్ట్రేషన్లు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మండలంలో ఇప్పటికీ 7.5 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. వీఆర్వో టి.సీత, వీఆర్ఏ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కలిగి ఉండాలి



నిబంధనలు పాటించిన వాహనదారులకు పువ్వులు ఇస్తున్న విద్యార్థులు, అధికారులు

రావులపాలెం: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా అంశాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి డి.అశోక్ ప్రతాప్ అన్నారు. సోమవారం మండలంలోని ఈతకోట జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రత మహోత్సవంలో భాగంగా ఎంవీఐ ఓలేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక సత్యసాయి స్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొని నిబంధనలు పాటిస్తున్న వాహనదారులకు పువ్వులు, గ్రీటింగ్ కార్డ్స్ ఇచ్చి అభినందనలు తెలిపారు. అదే విధంగా సీటు బెల్టు ధరించిన వాహనదారులకు పుష్పాలు ఇవ్వడంతో అభినందనలు తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ తదితర వాటిని ధరించి నిబంధనలు పాటిస్తే కలిగే ఉపయోగాలను వివరించడంతో పాటు, మద్యం వల్ల కలిగే అనర్థాలను, అలాగే అతివేగం వల్ల వచ్చే నష్టాలను వాహనదారులకు వివరించారు. ప్రతి ఒక్కరూ భద్రత సూచనలు పాటించి అధికారులకు సహకరించాలన్నారు. వాహనదారులు ఎప్పుడూ సంబంధిత పత్రాలను కూడా ఉంచుకోవాలని సూచించారు.

జాగృతి పోటీ పరీక్షలు

ఆలమూరు: గ్రామంలో సోమవారం వివేకానందుడి సందేశం అనే అంశంపై జాగృతి పోటీ పరీక్ష జరిగింది. స్థానిక సిద్ధార్థ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ పరీక్షకు సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరంలోని రామకృష్ణ మిషన్‌ను ఏర్పాటు చేసి 125 యేళ్లు పూర్తయిన సందర్భంగా హైస్కూల్ విద్యార్థులకు జాగృతి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికల జోరు



వైఎస్సార్ సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పరిపాలనకు ఆకర్షితులై మండలంలోని పొడగట్లపల్లి గ్రామం నుంచి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు కొప్పాడి రవీంద్ర ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన పలువురు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన కర్రి శ్రీను, కర్రి ముత్యాలు, కొప్పాడి తాతారావు, కొప్పాడి ప్రసాద్, కొప్పాడి నారాయణ మూర్తి, కర్రి గాలిబాలుడు, కర్రి బ్రహ్మస్వామి, విప్పర్తి అర్జున్, బసవాని రాణి, కర్రి దివ్య, కర్రి లక్ష్మి, అంగాడి దుర్గారావు, బర్రె గోవిందు, కర్రి రాంబాబు, కొప్పాడి శ్రీను తదితరులను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆప్యాయంగా పలకరిస్తూ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే అందరికీ సముచిత స్థానం ఉంటుందని భరోసా కల్పించారు.

దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ



అంబాజీపేటలో దళిత సింహ గర్జన పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న దళిత సంఘ నాయకులు

అంబాజీపేట: ఈ నెల 11వ తేదీన వేమగిరిలో నిర్వహించే దళిత సింహ గర్జనను విజయవంతం చేయాలని దళిత సంఘ నాయకులు పిలుపునిచ్చారు. అంబాజీపేట బస్టాండ్‌ స్టేషన్ ఎదురుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సింహ గర్జన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దళితుల రాజకీయ హక్కులు, తదితర అంశాలను గర్జనలో వినిపించాల్సి ఉందన్నారు. మండలంలోని దళిత సోదరులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నూకపెయ్యి చిన్న, మాత సత్యనారాయణ, నాగాబత్తుల నరసింహమూర్తి, కత్తుల బాబులు, గోసంగి సత్యనారాయణ, బీర సురేష్, మాగాపు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అంబేడ్కర్



ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అంబేడ్కర్

రాజోలు: రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మోర్త అంబేడ్కర్ సోమవారం నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం ఆర్‌జేడీ కార్యాలయం నుంచి అంబేడ్కర్‌ను ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఇంతవరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన రిటైర్డ్ డీఐఈఓ కేవీవీ సత్యనారాయణరెడ్డి నుంచి అంబేడ్కర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన అంబేడ్కర్‌ను అధ్యాపకులు కె.గణేశ్వరరావు, డి.నాగమణి, కె.శ్రీరాములు, పీవీఎస్ సీహెచ్ రాజు, బి.నరసింహారావు, హరిప్రసాద్, పి.శ్రీనివాసరావు, పి.కుమారరాజా, ఎస్.శాంతశ్రీ, జె.రాజబాబు, అరుంధతి తదితరులు అభినందనలు తెలిపారు.

చిల్లర నాణేలతో ఆంజనేయస్వామికి తులాభారం



చిల్లర నాణేలతో తులాభారం వేసి ఆంజనేయ స్వామికి మొక్కు చెల్లిస్తున్న భక్తుడు

పి.గన్నవరం: నరేంద్రపురంలోని అభయాంజనేయ స్వామి వారి 31వ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన చెల్లి కిషోర్‌బాబు అనే యువకుడు చిల్లర నాణేలతో తులాభారం వేసి స్వామికి తన మొక్కును చెల్లించుకున్నారు. మొత్తం 80 కిలోల నాణేలను స్వామివారికి సమర్పించారు. ఈసందర్భంగా అతడి కుటుంబ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి వార్షిక మహోత్సవాలు మంగళవారంతో ముగుస్తాయని ఆలయ కమిటీ చైర్మన్ మానికిరెడ్డి లక్ష్మణరావు తెలిపారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. సప్తాహం సందర్భంగా వారం రోజుల పాటు భజన కార్యక్రమాలు నిర్వహించిన కళాకారులకు సత్కరిస్తామని, కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యపై ఆందోళన



మొగలికుదురు పంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న జగ్గన్నపేట ప్రాంతానికి వారం రోజుల నుంచి తాగునీరు రావడం లేదంటూ స్థానికులు సోమవారం గ్రామ పంచాయతీ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. మానేపల్లి ప్రాజెక్టు నుంచి తాగునీటిని సరఫరా చేసే పైప్ పాడైపోవడం వల్ల సమస్య ఏర్పడిందని వాపోయారు. తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా వారు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ సర్పంచ్ కడి అరుణకుమారి మాట్లాడుతూ స్థానికులకు ట్యాంకరు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కీర్తిని వివరణ కోరగా పాడైపోయిన చోట పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్నామని, తక్షణం సమస్యను పరిష్కరిస్తామన్నారు.

వై జంక్షన్‌లో ట్రాఫిక్ ఐల్యాండ్‌ను ఏర్పాటు చేయాలి



జిల్లా ఎస్పీ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కోకో ఫెడ్ చైర్మన్ బలరామమూర్తి తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక పేరూరు వై జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీ పెరిగి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా అక్కడ ట్రాఫిక్ ఐల్యాండ్‌ను, సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్‌కు కోనసీమ కన్జ్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ (కోకో ఫెడ్) ప్రతినిధుల బృందం వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, కార్యదర్శి ఆదిత్య కిరణ్, బీవీవీ సత్యనారాయణ, నాగాబత్తుల నరసింహమూర్తి, ఎం.సతీష్ తదితరులు ఎస్పీ శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను వివరించారు.

ఆరోగ్యశ్రీతో అందరికీ ప్రయోజనం



విశ్వేశ్వరాయపురంలో ఆరోగ్య సురక్ష కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



గుమ్మిలేరులో భారీ ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్యశాఖ

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీతో రాష్ట్ర ప్రజలందరికీ చక్కని ప్రయోజనాలు సమకూరుతున్నాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని విశ్వేశ్వరాయపురంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పాల్గొని కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో కీలక రోగాలకు సైతం ఉచితంగా వైద్య అందిస్తున్న ప్రభుత్వం ఇదేనని అన్నారు. జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి, ఎంపీటీసీ గుబ్బల హైమావతి, చింతా రాజబాబు, గుబ్బల రమేష్, సత్యనారాయణ, సోమిశెట్టి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య సేవలు

ఆలమూరు: పేదల ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇంటింటికీ వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంకు విశేష స్పందన లభిస్తుందని కొత్తపేట ఏడీఎంహెచ్‌ఓ ఎం.సుమలత అన్నారు. మండలంలోని గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఎఫ్‌డీసీ కార్యక్రమంలో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు చెందిన వైద్యులు పాల్గొని గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఎఫ్‌డీసీ ఆవశ్యకతను వివరిస్తూ వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ సుమలత వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్యులు సుజాత, శ్రీదేవి, శ్రావణి, సుశీల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలా దేవి, ఆర్.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

జీవనియంత్రణ సమన్వయ పథకంపై నేటి నుంచి అవగాహన

అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధ కేంద్రంలో మంగళవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు అఖిల భారత జీవనియంత్రణ సమన్వయ పథకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు. పథకం డైరెక్టర్, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎన్ సుశీల్, డాక్టర్ జి.శివకుమార్, నోడల్ అధికారి డాక్టర్ కె.శ్రీదేవి, ప్రధాన శాస్త్రవేత్తలతో పాటు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఎల్.నారంనాయుడు సందర్శించనున్నారన్నారు. జీవనియంత్రణ పరిశోధనలను సమీక్షించి రైతులకు అవగాహన కల్పించనున్నారన్నారు. ఈనెల 6న కొబ్బరి అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలతో చర్చాగోష్ఠి, వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ట్రైబల్ సబ్ ప్లాన్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 7న సన్నవిల్లి, ఉప్పలగుప్తం మండలాల్లో నల్లముట్టెపురుగు ఆశించిన రైతుల క్షేత్రాలను సందర్శిస్తారని చలపతిరావు తెలిపారు.

బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయంపై ఫిర్యాదు

పి.గన్నవరం: తన బ్యాంకు ఖాతా నుంచి ఏఈపీఎస్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు రూ.19,800 కాజేయడంతో మానేపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మురమళ్ల అంజిబాబు సోమవారం పి.గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంజిబాబు కాట్రేనికోన మండలం పల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన జగ్గన్నపేటలోని బ్యాంకులో శాలరీ అకౌంటును కలిగి ఉన్నారు. ఆ ఖాతా నుంచి ఈనెల ఒకటిన రూ.9900లు 4న రూ.9900లను ఏఈపీఎస్ ద్వారా కాజేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు అంజిబాబు విలేకరులకు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

మామిడికుదురు: విద్యార్థులు విద్యతో పాటు ఇతర అంశాలపై కూడా ప్రతిభ కనబర్చాలని ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సాయిబాబు సూచించారు. భారతీయ చిత్రకారుడు దామెర్ల రామారావు వర్ధంతి సందర్భంగా సోమవారం ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 3, 4, 5 తరగతులకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయిని ప్రజ్ఞ, డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు.

కిడ్నీ అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడి కుటుంబ సభ్యుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: రెండు కిడ్నీలు పాడైపోయిన బాలుడికి వైద్యులు కిడ్నీ మార్చాలని తెలిపారు. ఈ శస్త్రచికిత్సకు సాయం కోరగా స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బాధితుడికి రూ.24 వేల ఆర్థిక సాయం అందజేశారు. రాజోలు మండలం పొన్నమండ గ్రామానికి చెందిన రామ్ యోచన్ (13) బాబుకి రెండు కిడ్నీలు పాడైపోయాయి. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలి. దానికి రూ.15 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు.అంత ఆర్థిక స్తోమత లేక కుటుంబ సభ్యులు సాయం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను కోరారు. దీంతో సోమవారం రావులపాలెంలో రామ్ యోచన్ అన్నయ్య నరేంద్రకుమార్‌కి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.24 వేలు అందించినట్టు సభ్యులు తెలిపారు.

చేతిరాత పోటీల్లో లక్ష్మశ్రీకి ప్రథమస్థానం



మరాఠీ నటుడు సౌరభ్ గోకులే చేతుల మీదుగా మెమెంటో అందుకుంటున్న లక్ష్మశ్రీ

రావులపాలెం: ఆల్ ఇండియా స్థాయిలో విజ్ కిడ్స్ కార్నివాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ హ్యాండ్ రైటింగ్ కాంపిటీషన్ అండర్ 6–8 సంవత్సరాల కేటగిరీలో రావులపాలేనికి చెందిన కొవ్వూరి లక్ష్మశ్రీ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తల్లిదండ్రులు కేవీవీఎస్ సూర్యనారాయణ రెడ్డి, ఆదిమహాలక్ష్మి సోమవారం తెలిపారు. ఈనెల నాలుగో తేదీన పూణే సింబయోసిస్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన కిడ్స్ ప్రీమియర్ లీగ్ సెషన్–2 గ్రాండ్ ఫైనల్‌లో చేతిరాత విభాగంలో లక్ష్మశ్రీ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇండియా వైడ్ 50 సిటీలకు సంబంధించి 200 మంది విద్యార్థులు ఫైనల్‌కు రాగా తమ కుమార్తె ప్రథమ స్థానం దక్కించుకుందన్నారు. మరాఠీ నటుడు సౌరభ్ గోకులే చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు రూ.5 వేల నగదు అందుకుందన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



సఖినేటిపల్లి తహసీల్దార్ పెద్దిరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది



ఆలమూరులో తహసీల్దార్ గోపాలకృష్ణను ఘనంగా సత్కరిస్తున్న వీఆర్వోలు

సఖినేటిపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్‌గా జి.పెద్దిరాజు బాధ్యతలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు నూతన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దారు సీహెచ్ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వి.రామరాజులు బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరణ

ఆలమూరు: మండల తహసీల్దార్‌గా కె.గోపాలకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లాలోని చల్లపల్లి మండలం నుంచి బదిలీపై మండలానికి విచ్చేశారు. అలాగే ఇప్పటి వరకూ తహసీల్దార్‌గా పనిచేసిన ఐపీ శెట్టి బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా ఆచంట వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ గోపాలకృష్ణను మండల వీఆర్వోల సమాఖ్య ఘనంగా సత్కరించింది.

పి.గన్నవరం తహసీల్దార్‌గా ఎస్‌కే హుస్సేన్



పి.గన్నవరం: మండల తహసీల్దార్‌గా ఎస్‌కే హుస్సేన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయనకు డీటీ బి.గోపాలకృష్ణ, ఆర్ఐ పి.నర్సింహారావు, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఇంతవరకూ ఇక్కడ పనిచేసిన జి.రవీంద్రనాథ్ ఠాగూర్ కృష్ణా జిల్లా నందిగామకు బదిలీ అయ్యారు.

వృద్ధాప్య పింఛన్ పంపిణీ



సూర్యనారాయణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రేణుక

అంబాజీపేట: ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకుని ముమ్మిడివరంలో బంధువుల ఇంటి వద్ద ఉంటున్న మాచవరానికి చెందిన కంగాని సూర్యనారాయణ వద్దకు వలంటీర్ ఆర్.రేణుక వెళ్లి సోమవారం వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేశారు. ప్రతి నెలా లబ్ధిదారులకు పింఛన్ అందించాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా సూర్యనారాయణ ముమ్మిడివరంలో ఉన్నారని తెలుసుకుని వలంటీర్ రేణుక అతని వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసింది. వలంటీర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.